
## వేంకటేశ్వరస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే గోపాల్



నియోజకవర్గం ప్రజలందరూ సుభిక్షింగా ఉండాలని స్వామి వారిని కోరడం జరిగిందని బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్ తెలిపారు. తన గెలుపుతో పాటు హాట్రిక్ సీంఎంగా కేసీఆర్ చరిత్ర సృష్టించాలని స్వామి వారి దర్శించుకోవడం జరిగిందన్నారు. శనివారం తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నట్లు తెలిపారు. – చిక్కడపల్లి, అక్టోబర్ 28

## ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు స్వల్ప గాయం

చిక్కడపల్లి, అక్టోబర్ 28 : ముషీరాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ముఠా గోపాల్‌కు స్వల్ప గాయం అయ్యింది. శనివారం ఆయన తిరుమలలో స్వామి వారిని దర్శించుకున్న అనంతరం ఫ్లైట్ లో నగరానికి తిరిగి వచ్చారు. ఈ క్రమంలో ఎయిర్‌పోర్టులో ఎమ్మెల్యేకు కాలుకు గాయమయ్యింది. దీంతో ఆయన కుమారుడు ముఠా జయసింహ ఆయనను ఆసుపత్రిలో చికిత్స చేయించారు. అనంతరం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో విశ్రాంతి తీసుకుంటున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ముఠా జయసింహా తెలిపారు. ఆదివారం నిర్వహించే పాదయాత్ర యధావిధిగా కొనసాగుతుందని చెప్పారు..

## మంత్రి తలసానికి కృతజ్ఞతలు..

బన్సీలాల్‌పేట్, అక్టోబర్ 28 : పద్మారావునగర్‌లోని హమాలీబస్తీలో బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవం, బోనాల జాతర, ఆరు వేల మందికి భోజనాలను సమకూర్చిన మంత్రి తలసానికి, బస్తీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం ఉదయం బస్తీవాసులు ఆయనను కలిసి శాలువా కప్పి ధన్యవాదములు చెప్పారు. హమాలీబస్తీలోని రెండు ఫేజ్‌లలో నివసించే రెండు వేల కుటుంబాలు ఎన్నో ఏండ్ల నుండి బొడ్రాయి ఏర్పాటు చేయాలని అనుకుంటున్నామని, అది ఇప్పటికీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ద్వారా నెరవేరడం తమకు ఎంతో ఆనందంగా ఉన్నదని హమాలీబస్తీ అధ్యక్షుడు ఎన్.సుభాష్ అన్నారు. పదిరోజుల పాటు అన్ని పనులను దగ్గరుండి పర్యవేక్షించిన బీఆర్ఎస్ పద్మారావునగర్ ఇన్‌చార్జి జీ.పవన్‌కుమార్ గౌడ్‌ను బస్తీవాసులు సన్మానించారు. మంత్రిని కలిసిన వారిలో హమాలిబస్తీ అధ్యక్షుడు ఎన్.సుభాష్, యాదగిరి, అంజయ్య, సత్యనారాయణ, చిట్టి, ధర్మరాజు, ఎల్లయ్య, రాందాస్, లక్ష్మమ్మ, కౌసల్య, దుర్గ, కుషాల్, శ్యామ్, వెంకటేశ్, శివభార్గవ ఉన్నారు.

## ప్లాట్‌ఫాంపై వ్యక్తి మృతి..

కాచిగూడ,అక్టోబర్ 28: అనారోగ్యంతో రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి(55)ఉందానగర్ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం–2 చివర్లో కొంత కాలంగా అనారోగ్యంతో ఉంటూ శనివారం మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుని ఒంటిపై ఆకుపచ్చ రంగు చొక్క, గోధుమ రంగు ప్యాంట్ ధరించి, ఎత్తు 5.2 ఉన్నట్లు పేర్కొన్నారు. కేసును కాచిగూడ రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## చికిత్స పొందుతూ యాచకుడు..

గోల్నాక, అక్టోబర్ 28 : తీవ్ర అనారోగ్యానికి గురై దవాఖానలో చికిత్స పొందుతూ ఓ యాచకుడు మృతి చెందాడు. ఈ ఘటన అంబర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ డి. అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. అగస్టు నెల 25న బాగ్అంబర్‌పేట మల్లికార్జుననగర్‌లో ఓ గుర్తు తెలియని వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. ఇది గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం గాంధీ దవాఖానలో చేర్పించారు. ఇతను పేరు ఈశ్వర్(45)గా తండ్రి పేరు నారాయణగా గుర్తించిన పోలీసులు స్థానికంగా యాచకుడిగా గుర్తించారు. కాగా గత మూడు నెలల నుంచి గాంధీ దవాఖానలో చికిత్స పొందుతున్న ఈశ్వర్... గత శుక్రవారం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న పోలీసులు తెలిపారు. ఎవరైనా ఉంటే అంబర్‌పేట పోలీసులను సంప్రదించాలని కోరారు.

# వంద కోట్లతో రోడ్ల నిర్మాణం

- అద్దంలా రహదారుల రూపురేఖలు
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు

ముషీరాబాద్, అక్టోబర్ 28: జీహెచ్ఎంసీ సర్కిల్–15 ముషీరాబాద్ నియోజకవర్గంలో చేపట్టిన రోడ్డు నిర్మాణతో నియోజకవర్గంలో రోడ్ల గతిని మార్చివేసింది. ఇటీవలి కాలంలో వంద కోట్ల నిధులతో ఏర్పాటు చేసిన వీడీసీసీ రోడ్లు అభివృద్ధికి తార్కానంగా నిలుస్తున్నాయి. గతంలో ఏ గల్లి, ప్రధాన రోడ్డు చూసినా గుంతలమయంగా ఉండగా బీఆర్ఎస్ ప్రభుత్వం గత ఐదేళ్లలో రోడ్ల తీరుతెన్నులను మార్చేసింది. అధ్వానంగా మారిన పలు ప్రధాన, అంతర్గత రోడ్లలో ప్రయాణం సాగించడానికి ప్రజలు పడుతున్న ఇక్కట్లను గుర్తించిన ప్రభుత్వం ఇటీవలి కాలంలో రోడ్డు నిర్మాణాలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించింది. ఏడాది కాలంలోనే ముషీరాబాద్ నియోజకవర్గంలో దాదాపు వంద కోట్ల వ్యయంతో రోడ్డు నిర్మాణాలు చేపట్టి రోడ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. గతలోం వచ్చిన వరదల కారణంగా దెబ్బతిన్న రోడ్ల స్థానంలో కొత్తగా రోడ్డు నిర్మాణాలు చేపట్టి ఎక్కడ గుంత ఉన్నా పూడ్చి అధునాతన టెక్నాలజీతో కూడిన రోడ్డు నిర్మాణాలు చేపట్టారు. కొత్తగా అందుబాటులోకి వచ్చిన అధునాతన టెక్నాలజీతో కూడిన వీడీసీసీ రోడ్డు నిర్మాణాలను పెద్ద ఎత్తున చేపడుతున్నారు అధికారులు. చాలా కాలం రోడ్డు మన్నిక ఉండేలా వీడీసీసీ రోడ్డు నిర్మాణ పనులను పలు ప్రధాన మార్గాల్లో చేపట్టారు. ముషీరాబాద్ చేపల మార్కెట్–రాంనగర్ చౌరస్తా వరకు రూ. కోటి 65 లక్షల వ్యయంతో విడీసీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. అదేవిధంగా దాదాపు వంద కోట్ల వ్యయంతో విద్యానగర్ అచ్చుత్‌రెడ్డి మార్గ్, నాగయ్యకుంట రోడ్డు, రిసాల, ముషీరాబాద్ వినోబానగర్ మార్టినెంట్ స్కూల్, హరినగర్, మోహన్‌నగర్, రాంనగర్ పోచమ్మటెంపుల్, పార్శిగుట్ట రోడ్, బయాలోజికల్ ఈ కంపెనీ, లలితానగర్ తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. గుంతలమయంగా ఉన్న అచ్చుత్‌రెడ్డి మార్గ్–బయాలోజికల్ ఈ కంపెనీ, రాంనగర్ చేపల మార్కెట్ రోడ్లను అద్దంలా ఏర్పాటు చేశారు. దీంతో ఈ మార్గాల్లో వాహనాల రాకపోకలకు ఇక్కట్లు తొలగిపోయాయి.



కొత్తగా రోడ్డు నిర్మాణంతో అద్దంలా మారిన రాంనగర్ చేపల మార్కెట్ రోడ్డు

**గాడిన పడ్డ ప్రధాన రోడ్ల నిర్వహణ..**

ఇటీవల ప్రధాన రోడ్ల నిర్వహణను ప్రైవేటు సంస్థలకు అప్పగించడంతో రోడ్డు సమస్యలు పరిష్కారమయ్యాయి. రోడ్ల నిర్వహణ కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం నిర్వహణ సక్రమంగా ఉండేలా, వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని ప్రధాన మార్గాలైన వీఎస్‌టీ–రాంనగర్, విద్యానగర్–ఆర్టీసీ క్రాస్ రోడు, అశోక్‌నగర్–ట్యాంక్‌బండ్, కవాడిగూడ వైస్రాయ్ హోటల్, ట్యాంక్‌బండ్, చిక్కడపల్లి–నారాయణగూడ, ముషీరాబాద్–ఆర్టీసీ క్రాస్ రోడ్డు వంటి ప్రధాన రోడ్లు నిర్వహణ ఇటీవల గాడిలో పడింది. ఏ రోడ్డు చూసినా సాఫీగా ప్రయాణం సాగిపోయేలా ఉంది.

**విస్తరణతో తగ్గిన ట్రాఫిక్ తిప్పలు..**

ముషీరాబాద్ నియోజకవర్గంలో ఇటీవల పలు కూడళ్ల విస్తరణ, యూటర్న్‌ల ఏర్పాటు మూలంగా ట్రాఫిక్ ఇక్కట్లు తొలగిపోయాయి. ఒక్కప్పుడు ఆర్టీసీ క్రాస్ రోడ్ పద్మవ్యూహం నుంచి దాటాలంటే వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడేవారు. గత రెండేళ్లుగా పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఆర్టీసీ క్రాస్ రోడ్డు చౌరస్తాను విస్తరించి యూటర్న్ ఏర్పాటు చేయడంతో దాదాపు ట్రాఫిక్ చిక్కులు తొలగిపాయాయి. దీనికితోడు ప్రతిష్ఠాత్మకంగా స్టీలు వంతెన నిర్మించి అందుబాటులోకి తేవడంతో ముషీరాబాద్ నియోజకవర్గంలో దాదాపు ట్రాఫిక్ చిక్కులు తొలగిపోయినట్లయ్యింది. మరోవైపు విఎస్‌టీ చౌరస్తాను విస్తరించడంతో ట్రాఫిక్ జామ్ సమస్య తీరింది.

### నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా కృషి

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తున్నాం. గతంలో ఏ గల్లి చూసినా గుంతలమయంగా ఉండేది. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత రోడ్ల తీరుతెన్నులను మార్చేశాం. నియోజక వర్గంలో అధ్వానంగా ఉన్న రోడ్ల స్థానంలో రూ. వంద కోట్లను కేటాయించి నూతన రోడ్లను నిర్మించాం. దీంతో రోడ్లన్నీ అదంలా దర్శనమిస్తున్నాయి. – ఎమ్మెల్యే ముఠా గోపాల్

## ఆదివాసీ గిరిజనులు హక్కులకై ఉద్యమించాలి

కవాడిగూడ, అక్టోబర్ 28 : ఆదివాసి గిరిజనులు తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉండి ఉద్యమించాలని గిరిజన ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, రిటైర్డ్ కార్మిక శాఖ అడిషనల్ కమిషనర్ హెచ్‌కె నాగు, వర్కింగ్ ప్రెసిడెంట్ వివేక్ నాయక్‌లు పిలుపునిచ్చారు. కొమురం భీమ్ 83వ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం ట్యాంక్‌బండ్‌పై ఉన్న కొమురం భీమ్ విగ్రహానికి వారు పూల మాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జల్, జమీన్, జంగిల్‌పై హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. దళిత బంధు తరహాలో ఆదివాసీ బంధు పథకం ప్రవేశపెట్టి అమలు చేయాలని డిమాండ్ చేశారు. జీవితాంతం ఆదివాసీల కోసం పోరాటం చేసిన కొమురం భీమ్‌కు భారత రత్న అవార్డును కేంద్రం ప్రకటించాలన్నారు. గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఆదిలాబాద్ జిల్లాలో ఏర్పాటు చేయాలని, ఎస్టీ కమిషన్‌ను తక్షణమే ఎస్సీ, ఎస్టీ కమిషన్ నుంచి వేరు చేసి ఎస్టీలకు ప్రత్యేకంగా ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. అటవీ హక్కుల చట్టం 2006ను పకడ్బందీగా అమలు చేసి పెండింగ్‌లో ఉన్న పత్రాలను పంపిణీ చేయాలన్నారు. ఐక్యరాజ్యసమితి నిర్ణయించిన ప్రకారం ఆగస్టు 9వ తేదీని ప్రపంచ ఆదివాసీ దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఐక్యవేదిక కోశాధికారి సోయం గోవర్ధన్, ఆదివాసీలు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్దెత్తున పాల్గొని కొమురంభీంకు నివాళ్లర్పించారు.



కొమురంభీమ్ వర్ధంతి సందర్భంగా ట్యాంక్‌బండ్‌పైఉన్న కొమురం భీమ్ విగ్రహానికి నివాళ్లర్పిస్తున్న గిరిజన ఐక్యవేదిక నేతలు

## నేడు దసరా మిలాప్-2023

కవాడిగూడ, అక్టోబర్ 28 : అరుంధతీయ బంధు సేవా మండలి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సంయుక్తాధ్వర్యంలో నేడు భోలక్‌పూర్‌లోని దేవుని కోటలో 41వ వార్షికోత్సవ దసరా మిలాప్–2023 వేలడుకలు నిర్వహించనున్నట్లు బంధు సేవామండలి రాష్ట్ర అధ్యక్షుడు కేపీ నర్సింగ్‌రావు, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు బి. నర్సింగ్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు, మహిళా సదస్సులు, వివాహ పరిచయవేదిక నిర్వహించనున్నట్లు వారు చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర మాజీ మంత్రి దామోదర రాజనర్సింహా, తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక అధికారి డాక్టర్ మంద జగన్నాథం, ఎంపీ కె. రాములు, ఎర్రోళ్ల శ్రీనివాస్, మందకృష్ణ మందిగ, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డా. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హాజరవుతారని తెలిపారు.

